క్లుప్తంగా

వరి గడ్డివామి దగ్ధం



పిట్టలవానిపాలెం:ప్రమాదవశాత్తూ పది ఎకరాల వరి గడ్డి వామి దగ్ధమైన ఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు..మండలంలోని ఖాజీపాలెం గ్రామానికి చెందిన చెరుకూరి నరసింహరావుకు చెందిన వరి గడ్డి వామి శుక్రవారం రాత్రి ప్రమాదవశాత్తూ దగ్ధమైంది. స్థానికులు స్పందించి మంటలను అదుపుచేశారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

రేపల్లె రూరల్: దివ్యాంగుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న అరుణశ్రీ దివ్యాంగుల సేవా సంక్షేమ సంఘం కార్యాలయం ఏర్పాటుకు ప్రభుత్వం రేపల్లె పట్టణంలో స్థలం కేటాయించాలని సంఘ అధ్యక్షుడు జానం మురళీకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భవన సముదాయం ఏర్పడితే దివ్యాంగుల సమస్యలను నిరంతరం తెలుసుకునేందుకు, వివిధ కార్యక్రమాల నిర్వహణకు అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు. దివ్యాంగుల ఏడీ కార్యాలయం ఒంగోలు పట్టణంలో ఉందని, వివిధ పనులపై అక్కడికి వెళ్లాలంటే కష్టతరంగా ఉందని తెలిపారు. బాపట్ల జిల్లా ఏర్పడి నేపథ్యంలో ఏడీ కార్యాలయాన్ని జిల్లా కేంద్రం లేదా రేపల్లె పట్టణంలో ఏర్పాటు చేయాలని తెలిపారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



అద్దేపల్లి(భట్టిప్రోలు):స్వాతంత్ర్యోద్యమంపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని ఎంఈఓ నీలం దేవరాజు అన్నారు. ఎస్ఎఫ్ఐ, సీఐటీయూ ఆధ్వర్యంలో ఆగస్టు 15న అద్దేపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించారు. విజేతలకు శనివారం ఎంఈఓ దేవరాజు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ జ్ఞానం చదువుతో మాత్రమే అందుతుందని చెప్పారు. ఉపాధ్యాయులు, పెద్దలు చెప్పిన విషయాలను వినడం, నేర్చుకోవడం ద్వారా సమాజంలో మంచి గుర్తింపు పొందుతారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ బాపట్ల జిల్లా ఉపాధ్యక్షుడు పి. మనోజ్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు ప్రశాంతి, ఎస్ఎంసీ చైర్మన్ మాధురి, వైస్ చైర్మన్ అమ్రేష్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు సర్వేయర్ల అభినందన



భట్టిప్రోలు: ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన గుమ్మా చంద్రశేఖరరావును మండల సర్వేయర్ బి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గ్రామ సచివాలయ సర్వేయర్లు శనివారం అభినందించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇక్కడి నుంచి కృష్ణా జిల్లా మొవ్వ మండలానికి చంద్రశేఖర్ బదిలీ అయ్యారు. తిరిగి బాధ్యతలు చేపట్టిన ఆయనను సర్వేయర్లు ఘనంగా సన్మానించారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

కొల్లూరు : లారీ, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనపై కేసు నమోదు చేసినట్లు స్థానిక పోలీసులు శనివారం తెలిపారు. ఈపూరు కరకట్టపై ఇటీవల రేపల్లెకు చెందిన ద్విచక్ర వాహనదారుడు చిల్కా పాల్ భక్త్ సింగ్ ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టి గాయపడ్డారు. తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు గుంటూరులోని ప్రవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు. క్షతగాత్రుడి తండ్రి ప్రకాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ జి. ఏడుకొండలు పేర్కొన్నారు.

ఎరువుల దుకాణం తనిఖీ



పెరవలిపాలెం(వేమూరు): అనుమతులు లేకుండా ఎరువులు విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ శాఖ అధికారిణి సునీత హెచ్చరించారు. మండల కేంద్రంలోని పెరవలిపాలెంలో ఉన్న లక్ష్మీ శ్రీనివాస సీడ్స్ దుకాణంలో శనివారం తనిఖీ చేశారు. బిల్లు పుస్తకాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ..ఖరీఫ్ సీజన్‌లో రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో రత్నప్రసాద్, గ్రామ వ్యవసాయాధికారి నాగూర్ వలీ, వీరా శేఖర్ పాల్గొన్నారు.

న్యాయం కావాలి

- విధులు బహిష్కరించిన వైద్యులు, సిబ్బంది
- కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ హత్యాచారంపై నిరసన
- దోషులను కఠినంగా శిక్షించి, న్యాయం చేయాలని డిమాండ్



కొల్లూరులో నిరసన ప్రదర్శన చేస్తున్న పీహెచ్‌సీ వైద్య, ఆరోగ్య సిబ్బంది

కొల్లూరు : కోల్‌కతాలోని డాక్టర్ రాధా గోబింద్ కర్ మెడికల్ కాలేజీ, హాస్పిటల్‌లో మహిళా జూనియర్ డాక్టర్‌ను పాశవికంగా అత్యాచారం చేసి, హత్యకు పాల్పడటాన్ని వైద్య, ఆరోగ్య సిబ్బంది ముక్త కంఠంతో ఖండించారు. వైద్యురాలికి న్యాయం చేయాలన్న డిమాండ్‌తో శనివారం నిరసన ప్రదర్శన చేపట్టారు. స్థానిక పీహెచ్‌సీలో వైద్య సేవలను బంద్ చేశారు. మృతురాలికి మద్దతుగా నినాదాలు చేస్తూ పీహెచ్‌సీ నుంచి కొల్లూరు ప్రధాన రహదారిలో ప్రదర్శన జరిపారు. అత్యంత హేయమైన దారుణానికి పాల్పడిన దోషులను వెంటనే శిక్షించాలని నినదించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి కావ్యతేజ, సూపర్ వైజర్లు, ఏఎస్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నగరంలో నిరసన ర్యాలీ

నగరం: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారాన్ని నిరసిస్తూ శనివారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది నగరంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు ఓపీ సేవలు నిలిపివేశారు. డాక్టర్ రత్నకుమారి మాట్లాడుతూ నిందితులను కఠినంగా శిక్షించి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. వైద్యశాల సిబ్బంది, ఏఎస్ఎంలు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

రేపల్లె రూరల్: వైద్య విదార్థినిపై లైంగిక దాడి, హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఐఎంఏ పట్టణ అధ్యక్షుడు ఎన్‌బీ రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో 24 గంటలు వైద్య సేవల బంద్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. డాక్టర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ వైద్యులు, వైద్య విద్యార్థులు, నర్సులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలన్నారు. భవిష్యత్‌లో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఆర్డీవో హెలా షారోన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ కార్యదర్శి వసంతం వీరరాఘవయ్య, సభ్యులు డాక్టర్ ఏవీ సుబ్బారావు, రైతు సంఘం నాయకులు మండవ శోభారాణి పాల్గొన్నారు.



నగరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న డాక్టర్ రత్నకుమారి, సిబ్బంది



రేపల్లె పట్టణంలో ఆందోళన నిర్వహిస్తున్న వైద్యులు



కర్లపాలెంలో మానవహారంగా నిరసన ప్రదర్శన



వేమూరు ఎస్‌హెచ్‌సీ వైద్యుల నిరసన

దోషులను కఠినంగా శిక్షించాలి

కర్లపాలెం:జూనియర్ డాక్టర్‌పై లైంగి దాడి చేసి, హత్య చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ఎం.గోపీనాథ్ డిమాండ్ చేశారు. కర్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య సిబ్బంది శనివారం కర్లపాలెంలో ర్యాలీ నిర్వహించి, మానవహారంగా నిరసన ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుహానా బేగం సీహెచ్‌వోలు ఎస్.మేరిమ్మ, యు.ప్రభావతి, సూపర్ వైజర్లు, ఇసాక్, వైద్య ఆరోగ్య సిబ్బంది, కిషోర్, జాషువా, శేషు, ఏఎన్ఎంలు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వేమూరులో నిరసన ప్రదర్శన

వేమూరు: విధుల్లో ఉన్న జూనియర్ వైద్యురాలను హత్య చేయడం చాలా దారుణమని సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ సయ్యద్ జెరినా పర్వీన్ అన్నారు. మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యులు శనివారం ఈ మేరకు నిరసన వ్యక్తం చేశారు. ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ అనిల్, ఇందిర ప్రియదర్శి, శ్రీనివాసరావు, మురళీ కృష్ణ, ఫాతి మునీసా, ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీటిని అందించండి

వరి పొలాలను పరిశీలించిన బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర



రైతులు,అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగేశన

పిట్టలవానిపాలెం: సాగునీటిని అందించి అన్నదాతకు అండగా నిలవాలని బాపట్ల శాసన సభ్యుడు వేగేశన నరేంద్ర వర్మ జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు. శనివారం మండలంలోని కోమలి శివారులో నీరు లేక ఎండుముఖం పట్టిన వరి పొలాలను అధికారులు, నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. సాగునీటి కోసం నానా తిప్పలు పడుతున్నామని స్థానిక రైతులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఆరెమండ్ల చానెల్ ఎగువ ప్రాంతంలోని రైతులు నాలుగు అడుగులకు పైగా తూములు ఏర్పాటు చేసుకుని, అక్రమంగా నీటిని తోడుకుంటున్నారని వివరించారు. దీంతో దిగువ ప్రాంతానికి నీరందక ఎన్నో ఇబ్బందులు పడాల్సి వస్తోందని చెప్పారు. అక్రమంగా నీటిని వాడుకుంటున్న వారికి నీటి పారుదల శాఖ అధికారులు కూడా వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు.

పీవీపాలెం ఎస్ఎంసీ ఎన్నిక ఏకగ్రీవం



లక్ష్మీ తిరుపతమ్మ



శ్రావణ సంధ్య

పిట్టలవానిపాలెం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూలు మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండల విద్యాశాఖాధికారి ఉయ్యూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 8న పాఠశాలలో కోరం లేక పోవడంతో ఎన్నికలు వాయిదా పడినట్లు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల శనివారం నిర్వహించామని చెప్పారు. కమిటీ చైర్మన్‌గా డేగల లక్ష్మీ తిరుపతమ్మ, వైస్ చైర్మన్‌గా రాజుల పాటి శ్రావణ సంధ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. కమిటీ సభ్యులు, చైర్మన్, వైస్ చైర్మన్‌లతో ప్రమాణ స్వీకారం చేయించారు.

ప్రొటోకాల్‌కు ప్రాధాన్యమివ్వాలి

ఎంపీపీ లలిత కుమారి



మాట్లాడుతున్న ఎంపీపీ లలిత కుమారి, పక్కన ఎంపీడీవో, జెడ్పీటీసీ

భట్టిప్రోలు: ప్రొటోకాల్ ప్రతి ఒక్కరూ తప్పని సరిగా పాటించాలని, ప్రతి విషయంలో అధికారులు ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకోవాలని అప్పుడే శాఖ పరంగా సమాచారం తెలుస్తుందని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి అన్నారు. శనివారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి ఎంపీపీ అధ్యక్షత వహించి, మాట్లాడారు. ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా కార్యక్రమాలు జరపరాదన్నారు. ఆయా శాఖల అధికారులు సమావేశానికి రాకుండా తమ కిందిస్థాయి అధికారులను పంపడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. అధికారుల గైర్హాజరుపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశానికి రాని అధికారులకు మెమోలు జారీ చేయాలని ఎంపీడీవో చంద్రశేఖరరావుకు సూచించారు. అధికారులు బాధ్యతతో పని చేసి, మండలాభివృద్ధికి పాటు పడాలని కోరారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉన్నందున గ్రామాల్లో పారిశుధ్యానికి ప్రాధాన్యమివ్వాలని కోరారు. అనంతరం కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ హాస్పిటల్‌లో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనపై రెండు నిమిషాలు మౌనం పాటించారు. జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయ భాస్కరి, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్య శాస్త్రి, ఎంపీటీసీ సభ్యులు సర్పంచులు, వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.

సర్ రామ్‌నాథ్ చోప్రా స్మారక వేడుకలు



సర్ రామ్ నాథ్ చోప్రా చిత్రపటానికి నివాళి

గుంటూరు రూరల్: భారతీయ ఔషధ నిపుణుడు, పరిశోధకుడు, వైద్య రంగానికి గణనీయమైన కృషిచేసిన మహనీయుడు సర్ రామ్‌నాథ్ చోప్రా అని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. శనివారం నగర శివారులోని లాం నందున్న కళాశాలలో ఏర్పాటు చేసిన ఫాదర్ ఆఫ్ ఇండియన్ ఫార్మాకాలజీ సర్ రామనాథ్ చోప్రా స్మారక వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, చిత్రపటానికి పూల మాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ భారతీయ మొక్కలు, ఔషధ లక్షణాలపై సమగ్ర సమాచారం అందిస్తూ మెటీరియా మెడికా ఆఫ్ ఇండియన్ డ్రగ్స్ అనే పుస్తకాన్ని ఆయన రచించినట్లు తెలిపారు. అది వైద్య రంగానికి వనరుగా మారిందన్నారు. సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ బోనమ్ శ్రీనివాస రెడ్డి, చలపతి విద్యా సంస్థల అధినేత వైవీ ఆంజనేయులు, ఎన్ఎస్ఎస్ యూనిట్ సభ్యులు తదితరులు పాల్గొని యాంటీ ర్యాగింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త ఓటర్ల జాబితాను రూపొందించాలి



మాట్లాడుతున్న తహసీల్దారు శ్రీనివాసరావు

రేపల్లె రూరల్: సంక్షిప్త ఓటర్ల జాబితాను రూపొందించేందుకు బీఎల్వోలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తహసీల్దార్ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం బీఎల్వోలతో ఆయన సమావేశం నిర్వహించి, మాట్లాడారు. తప్పొప్పులు లేని నిర్దిష్టమైన ఓజాబితాను సిద్ధం చేయాలని ఎన్నికల కమిషన్ నిర్ణయించిందన్నారు. ఈ మేరకు ఈ నెల 20 నుంచి అక్టోబరు 18వ తేదీ వరకు బీఎల్వోలు తమ పరిధిలోని గ్రామాల్లో ఇంటింటి సర్వే చేయాలని చెప్పారు. సర్వేలో వచ్చిన అభ్యంతరాలపై అక్టోబర్ 19 నుంచి 28వ తేదీ వరకు దరఖాస్తుల పరిశీలన చేయాల్సి ఉంటుందన్నారు. అనంతరం గ్రామాల్లో ఓటర్ల జాబితాపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని వివరించారు. జనవరి 25న సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితాను ప్రకటించటం జరుగుతుందన్నారు. ఈ మేరకు బీఎల్వోలు నిబద్ధతతో పనిచేయాలని సూచించారు.

ఏపీయూడబ్ల్యూజే 67వ ఆవిర్భావోత్సవాలు



బాపట్ల: ఏపీయూ డబ్ల్యూజే 67వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక బధిరుల పాఠశాలలో శనివారం విద్యార్థులకు అన్నదానం చేశారు. మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ భోజనం వడ్డించారు. మాజీ ఎంపీపీ మానం విజేత, అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.రాంబాబు, మేధ శ్రీనివాసరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు సలగల రాజశేఖర బాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల పాటి లక్ష్మీనారాయణ, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన శివన్నారాయణ, తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి మానవ విజేత, విలేకరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు అభినందన



విద్యార్థిని, అతని తండ్రిని సన్మానిస్తున్న రవికిరణ్, పక్కన ఎంపీపీ, జెడ్పీటీసీ

పెసర్లంక(భట్టిప్రోలు): గ్రామీణ ప్రాంతాల్లో సైతం మెరికల్లాంటి విద్యార్థులు ఉన్నారని ప్రముఖ పారిశ్రామిక వేత్త వేములపల్లి రవికిరణ్ అన్నారు. మండలంలోని పెసర్లంక దేవభక్తుని కోటయ్య జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు నలుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. శనివారం స్థానిక పాఠశాలలో విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ప్రధానోపాధ్యాయులు ఎస్కే మహబూబ్ బాషా అధ్యక్షత వహించారు. రవి కిరణ్ మాట్లాడుతూ తాను కూడా గ్రామీణ ప్రాంతంలో విద్యా బుద్ధులు నేర్చుకుని ఈ స్థాయికి ఎదిగినట్లు తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి పదవ తరగతిలో ప్రథమ, ద్వితీయ తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు రూ.25 వేలు, రూ. 15 వేలు, రూ.10 వేలు చొప్పున నగదు ప్రోత్సాహకాలు, 585 మార్కులు పైబడి వచ్చిన విద్యార్థులకు జీవితాంతం చదువుకు సహకారం అందించనున్నట్లు ప్రకటించారు. ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయుడు బాషా ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సమష్టి కృషితో విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించిడం అభినందనీయమన్నారు. ట్రిపుల్ ఐటీకి ఎంపికైన కంచర్ల రాహుల్, గొరిగపూడి కీర్తన, తెనాలి స్టీవెన్‌పాల్, జానపాటి హరిహర కుమార్‌ను అభినందించారు. ఒక్కో విద్యార్థికి రూ. 10 వేలు నగదు, మెమెంటోలను రవికిరణ్ అందచేశారు. తల్లిదండ్రులను సన్మానించారు. ఎంఈవో నీలం దేవరాజ్, ఎంపీటీసీ సభ్యులు చంటి, పెసర్లంక, పెదలంక, చింత మోటు సర్పంచులు వెంకటేశ్వరరావు, శ్రీ రంజని, వీరాంజనేయులు, గుమ్మడి శంకరరావు, ఎస్ఎంసీ చైర్మన్ డి.శ్రీనివాసరావు, ఎంపీపీ పాఠశాల హెచ్ఎం వి.సురేష్ కుమార్ పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

బాపట్లటౌన్ : వైద్యాధికారులపై హత్యాచారం... హత్య చేయడం హేయమైన చర్యని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సర్వీస్ అసోసియేషన్ (ఏపీ జీఈఎస్ఏ) జిల్లా అధ్యక్షులు కూరపాటి సత్యంరాజు తెలిపారు. శనివారం సాయంత్రం బాపట్లలోని జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 9న కోల్‌కతాలో సభ్యసమాజం తలదించుకునేలా పావ విశంగా జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం జరిపి, హత్య చేసిన పరిస్థితి అత్యంత హేయమైనదన్నారు. ఈ ఘటన మరువక ముందే సేవకు స్టాఫ్ నర్సుపై ఉత్తరాఖండ్‌లో అత్యాచారం చేసి హత్య చేయడం కలిచివేసిందన్నారు. ఈ రెండు ఘటనలు యావత్ సభ్యసమాజం సిగ్గుతో తల దించుకునే ఘటనలన్నారు. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

కాకుమాను: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం ఎంఈవో కె.ఎఫ్.కెనడీ పరిశీలించారు. ప్రతి విద్యార్థికి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని మెనూ ప్రకారం తప్పని సరిగా ఆహారాన్ని అందించాలన్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఇన్‌చార్జి హెచ్ఎం వి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఉన్నారు. అనంతరం పాఠశాల సముదాయ సమావేశం నిర్వహించారు.

ఫిర్యాదులొస్తే శాఖాపరమైన చర్యలు

ప్రత్తిపాడు: రైతులు పట్టాదారు పాస్ పుస్తకాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని, కానీ కొందరు రైతులు సచివాలయాలకు వెళితే వీఆర్వోలు వద్దంటున్నారని, వాళ్లను అడిగి నాలుగైదు రోజుల తర్వాత దరఖాస్తు చేసుకోమని చెప్పి.. వెనక్కు పంపుతున్నారన్న ఫిర్యాదులు వస్తున్నట్లు తహసీల్దార్ కె.రవిబాబు తెలిపారు. ఇది సరైన పద్ధతి కాదని, ఇకపై ఇలాంటి ఫిర్యాదులొస్తే.. ఉపేక్షించేది లేదేని, శాఖ పరమైన చర్యలు ఉంటాయని వీఆర్వోలకు స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో శనివారం రెవెన్యూ సమస్యలు, పెండింగ్ అర్జీలపై వీఆర్వోలతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా పెండింగ్ అర్జీలను పరిశీలించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నమోదయ్యే అర్జీలు పెండింగ్‌లో ఉండటానికి వీల్లేదని తహసీల్దారు ఆదేశించారు. ఎప్పటికప్పుడు విచారణ త్వరితిగతిన పూర్తి చేసి, నిర్ణీత కాల వ్యవధిలో నివేదికలు అందజేయాలన్నారు. గ్రామాల్లో అందుబాటులో ఉండాలని, సీసీఆర్ కార్డులు మంజూరు మరింత వేగవంతం చేయాలని సూచించారు. ఆర్ఐ సాహితి, వీఆర్వోలు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమ అమరులకు జోహార్లు



జోహార్లు అర్పిస్తున్న నాయకులు

బాపట్ల: ప్రజా ఉద్యమాల్లో అమరులైన వీరులను స్మరించుకుంటూ జోహార్లు అర్పించడం గొప్ప విషయమని ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకుడు మేకల ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం స్థానిక డ్రైవర్స్ కాలనీలో అమర వీరులకు విప్లవ జోహార్లు అర్పించారు. ఈసందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పుట్టి, పేదల సమస్యల పరిష్కారానికి ఎన్నో పోరాటాలు చేసి అమరులైన మేకల సులోచన, తలతోటి మేరీ, నక్క దేవమ్మ, చింత దీనమ్మ, చప్పిడి వెంకటమ్మ, గంటా నాంచారమ్మ, తోకల సుబ్బమ్మ వంటి ఎంతో మందిని స్మరించుకోవాలన్నారు. ఏటా అమర వీరులకు నివాళి అర్పించటం జరుగుతుందని తెలిపారు.

విష జ్వరాలకు మురుగు నీరే కారణమా..?



లోటస్‌పాండ్ రిసార్ట్స్ సమీపంలో నిలిచిన మురుగు నీటిలో గేదెలు

బాపట్లటౌన్: గడిచిన పది రోజులుగా ముత్తాయపాలెం గ్రామంలో వర్షాలు కురవలేదు. వీధుల్లో వర్షపునీరు నిలిచింది లేదు. గ్రామంలోని మురుగునీరు పేరుకుపోయిన దాఖలాలు లేవు.... కానీ ఊరంతా విష జ్వరాలతో విలవిల్లాడుతున్నారు. ఇందుకు గ్రామ శివారులోని రెస్టారెంట్ సమీపంలో ఏళ్ల తరబడి నిలిచిన మురుగు నీరే కారణమని గ్రామస్తులు ముక్త కంఠంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మురుగునీరు తాగడం వల్ల గ్రామంలోని 30కి పైగా సూడి గేదెలు ఈసుకుపోయాయి. ఎన్నిసార్లు రెస్టారెంట్ నిర్వాహకులకు చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ముత్తాయపాలెం శివారులో ఏర్పాటు చేసిన లోటస్ పాండ్ రిసార్ట్స్ అండ్ రెస్టారెంట్ నిర్వాహకులు వేస్ట్ వాటర్ను ముందు భాగంలోని పంట పొలాలకు సాగునీరు అందించే బోదె కాలువలోకి వదులుతున్నారు. రిసార్ట్స్ ఏర్పాటు చేసి సుమారు 12ఏళ్లు అవుతోంది. అప్పటి మురుగు నీరంతా ఇందులోకి వదులుతున్నారు. దీంతో దోమల ఉద్ధృ విపరీతంగా పెరిగిపోయింది. బోదె కాలువలో మునిగిన గేదెలు గ్రామంలోకి రావడంతో దోమల వ్యాప్తి అధికమైంది. దీంతో ఎన్నడూలేని విధంగా ఊరంతా విషజ్వరాలు వ్యాపించాయని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. గ్రామంలోని నక్కల శ్రీనివాసరావుకు చెందిన రెండు గేదెలు, సుబ్బారావుకు చెందిన మరో రెండు ఆరు నెలల సూడి గేదెలు ఈ మురుగు నీరు తాగి ఈసుకుపోయాయి. ఇప్పటికీ సుమారు 30 గేదెలకు ఈసుకు పోయాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై డీపీఓ వి.రవికుమార్ స్పందిస్తూ.. వ్యర్థాలను పంట పొలాల్లోకి వదులుతున్న రెస్టారెంట్ యజమానికి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. మురుగునీటిని వెంటనే తొలగించేలా సిబ్బందికి ఆదేశాలు ఇస్తామన్నారు. అయిల్ బాల్స్ స్ప్రే చేయిస్తామని వివరణిచ్చారు.

పాఠశాలలను బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న సమగ్ర శిక్ష పర్యవేక్షణ అధికారి మోజెస్

చింతాయపాలెం (కర్లపాలెం):ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని సమగ్ర శిక్ష సహాయ పర్యవేక్షణ అధికారి బి.మోజెస్ పేర్కొన్నారు. శనివారం చింతాయపాలెం ప్రాథమిక పాఠశాలలో జరిగిన పాఠశాలల సముదాయాల శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మోజెస్ మాట్లాడుతూ ఉపాధ్యాయులందరూ విద్యాంజలి పోర్టల్‌లో పాఠశాలల అవసరాలను నమోదు చేయాలన్నారు. ఎంఈవో విద్యాశ్రీ మాట్లాడుతూ విద్యార్థులకు గుణాత్మక విద్యనందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.వెంకటరాజు, ఇ.పోలీస్‌రావు, పరిశుద్ధ రావు, ఉషాకిరణ్, గుదారంకయ్య పాల్గొన్నారు.

యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన

గుంటూరు రూరల్: ర్యాగింగ్ వల్ల జీవితాలు నాశనం అవుతాయని, తోటి విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలగాలని నల్లపాడు పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఏడుకొండలు తెలిపారు. శనివారం గోరంట్ల గ్రామంలోని సెయింట్ ఆన్స్ కళాశాలలో విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. నైతిక విలువలతో నిజాయితీగా ఉండాలని లఘు నాటిక ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ రెవరెండ్ సిస్టర్ సంధ్య, వైస్ ప్రిన్సిపల్ ఆర్ షారూన్ రోజ్, కళాశాల యాంటీ ర్యాగింగ్ కమిటీ కన్వీనర్ జె.ప్రమీలారాణి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
బాపట్ల డివిజన్
95055 07638 (బాపట్ల)
90102 23706 (వేమూరు, రేపల్లె)
Office mail : sakshigntadvt@gmail.com